క్లుప్తంగా

ఒత్తిడితో గుండెకు ముప్పు

అక్కిరెడ్డిపాలెం: మారుతున్న కాలంలో ఆహారపు అలవాట్లు, ధూమపానం, ఒత్తిడి కారణంగా గుండె ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని ఆస్పత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.నారాయణ రాజు తెలిపారు. ఈ నెల 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండె వ్యాధులు రావడానికి కారణాలు, రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగిన వ్యాయామం లేకపోవడమే గుండె జబ్బులకు మూలం అన్నారు. తగినంత నిద్ర లేకపోవడం, ఒత్తిడి కూడా కారణమని తెలిపారు. నిత్యం అరగంట నడక, శరీరానికి తగినంత వ్యాయామం అవసరమని తెలియజేశారు.

తిరుమల బాలాజీకి తిరుప్పావడ సేవ



బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుప్పావడ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో గల శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో గురువారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. తిరుమల బాలాజీ సన్నిధిలో పులిహోరను రాశిగా పోసి స్వామికి ఇష్టమైన శ్రీనివాస గద్యాన్ని పఠించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

డెంగ్యూపై అప్రమత్తత అవసరం



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఏడీసీ సన్యాసిరావు, ఏఎంవోహెచ్

పెదగంట్యాడ: డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలని ఏడీసీ సన్యాసిరావు అన్నారు. 74వ వార్డు నెహ్రూనగర్‌లో గురువారం డెంగ్యూపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల కారణంగా డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ప్రతి రోజూ ఇళ్ల వద్దకు వచ్చే శానిటరీ సిబ్బందికి ఇళ్లలోని చెత్తను అందజేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో డెంగ్యూ కేసులు నమోదు కావడంతో అప్రమత్తమైన అధికారులు స్థానికులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయమూర్తి శ్రీవిద్యకు సత్కారం



న్యాయమూర్తి శ్రీవిద్యను సత్కరిస్తున్న న్యాయవాదులు

గాజువాక: గాజువాక ప్రిన్సిపాల్ సబ్ జడ్జిగా పని చేస్తూ పదో ఏడీజేగా పదోన్నతి పొందిన నందనవనం శ్రీవిద్యను గాజువాక బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను న్యాయవాదులు కొనియాడారు. గాజువాక 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా వచ్చిన జి.షణ్ముఖరావుకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వై.శ్రీలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.వి.స్వామి, బి.వి.ఎం.కృష్ణ, సీనియర్ న్యాయవాదులు ఎస్.ఆదిలక్ష్మి, కె.సీతామహాలక్ష్మి, పల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో అగనంపూడి



అగనంపూడిలో రూ.17 కోట్లతో నిర్మిస్తున్న ఏరియా ఆస్పత్రి భవన సముదాయం



తలారివానిపాలెం శ్మశాన వాటికలో షెల్టర్, ప్రహరీ నిర్మాణం

వార్డు : 85
కార్పొరేటర్ : ఇల్లపు వరలక్ష్మి
చేపట్టిన పనులు:
- రూ. 5 కోట్లతో పబ్లిక్ వర్క్‌లు
- రూ.3 కోట్లతో నీటిసరఫరా, నిర్మాణ పనులు
- మరో రూ. 17 కోట్లతో ఆస్పత్రి ఆధునికీకరణ, అధునాతన వసతులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డులో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి చొరవతో జీవీఎంసీ నిధులు రూ.8 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, నీటి సరఫరా, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించడం, పైప్‌లైన్ల ఏర్పాటు తదితర పనులు చేపట్టారు. నాడు-నేడు పథకంలో భాగంగా అగనంపూడి ఆస్పత్రి ఆధునికీకరణ, స్థాయి పెంపుదల, వాటికి అనుగుణంగా వసతులు కల్పిస్తున్నారు. దాదాపు 85 శాతం పనులు పూర్తి చేశారు. స్ట్రక్చరల్ నిర్మాణ పనులు పూర్తి కాగా, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్ వంటి సౌకర్యాల కల్పన పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

- మంత్రిపాలెంలో రూ.49 లక్షలతో సామాజిక భవన నిర్మాణం.. మరో 40లక్షలతో రోడ్లు, డ్రైనేజీలు
- శ్రీరామ్‌నగర్ కాలనీలో రూ.80 లక్షలతో రహదారులు, డ్రైనేజీల నిర్మాణం
- మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు
- రూ.70లక్షలతో శ్రీరామ్‌నగర్ కాలనీ, మినీ జగదాంబ ప్రాంతాల్లో రహదారులు
- రూ.29లక్షలతో సాయినగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు
- రూ.83 లక్షలతో పెదమడకలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనం, నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు
- ఎస్సీ కాలనీ, జంగాల కాలనీ, సెక్టార్-1 కాలనీల్లో రూ.46 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- రూ. 29 లక్షలతో తలారివానిపాలెం శ్మశాన వాటిక నిర్మాణం
- రూ. మరో మూడుకోట్లతో గంగిరెడ్ల కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

ఫోకస్

కైలాసభూమిలో వసతులు కల్పించారు



రహదారిని ఆనుకొని శ్మశానం ఉండడం, మరో పక్క నివాసాలు ఏర్పాటు కావడం వల్ల శ్మశానవాటికలో దహన సంస్కారాలకు ఇబ్బందిగా ఉండేది. ప్రహరీ నిర్మాణంతో పాటు రెండు షెల్టర్లు నిర్మించడం, నీటి వసతి కల్పించడంతో అవస్థలు తీరాయి. – పి.గోవిందరావు, అగనంపూడి

ప్రాధాన్యతా క్రమంలో పనులు



ఎమ్మెల్యే నాగిరెడ్డి సహకారంతో వార్డులో ప్రాధాన్యత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నాం. రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సౌకర్యాలకు ముందుగా ప్రాధాన్యమిచ్చి నిధులు కేటాయించాం తరువాత రోడ్లు, డ్రైనేజీలు, శ్మశానవాటికల అభివృద్ధిపై దృష్టి పెట్టాము. వార్డులో దాదాపు సమస్యలన్నీ పరిష్కరించాం. సౌకర్యాలు కల్పిస్తున్నాం.
– ఇల్లపు వరలక్ష్మి, కార్పొరేటర్

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే సహించం



959వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించనివ్వబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 959వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన డబ్ల్యూఎండీ, యుటిలిటీస్, అడ్మిన్, టౌన్‌షిప్ అడ్మిన్ విభాగాల కార్మికులు పాల్గొని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు భగత్‌సింగ్



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

పెదగంట్యాడ: బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి అతి చిన్నవయసులోనే ప్రాణ త్యాగం చేసిన భగత్‌సింగ్ చిరస్మరణీయుడని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు అన్నారు. స్వాతంత్రం కోసం బల ప్రయోగం ఒకటే మార్గమని తలచి, వేలాది మంది పౌరులను స్వతంత్ర పోరాట యోధులుగా మార్చిన ఘనచరిత ఆయనదని తెలిపారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, ఆనంద్, దుర్గారావు, విష్ణుమూర్తి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల శాంతియాత్ర



శాంతియాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా గాజువాకలో ముస్లింలు గురువారం శాంతియాత్ర నిర్వహించారు. ఈద్ మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని సర్వ మానవాళికి శుభాకాంక్షలు తెలుపుతూ నిర్వహించిన ఈ శాంతి యాత్ర కొత్త గాజువాక నుంచి మెయిన్ రోడ్ మీదుగా పాతగాజువాక వరకు సాగింది. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి ముస్లింలకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మహ్మద్ ప్రవక్త జీవిత విశేషాలపై ప్రవచనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎండీ గౌస్, మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, వార్డు నాయకులు ఇర్ఫాన్, లుక్మాన్, దుబాయ్ బాషా, షౌకత్ అలీ, ఇక్బాల్, నజీర్, మోతి, ఖాజా, బాషా, షాహిద్, బాబా, పర్వేజ్, సమీర్, అలీ తదితరులు పాల్గొన్నారు.

ఇరువురు మంత్రుల భేటీ



మంత్రి నారాయణ స్వామిని సత్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కె.నారాయణ స్వామి గురువారం భేటీ అయ్యారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం నగరానికి విచ్చేసిన మంత్రి 68వ వార్డు మిందిలో మంత్రి అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ స్వామిని అమర్‌నాథ్ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్రిఫ్ట్ సొసైటీ సభ్యులకు 32 శాతం డివిడెండ్



మహాజన సభలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు ఆనందకుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు 32 శాతం డివిడెండ్ ఇవ్వనున్నారు. స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో జరిగిన స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ 58వ మహాజన సభలో ఈ మేరకు తీర్మానం ఆమోదించారు. సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ఆనందకుమార్ మాట్లాడుతూ 14,602 మంది సభ్యులు కలిగిన సొసైటీగా అవతరించి రూ.382 కోట్లు టర్నోవర్‌తో ప్రగతి పథంలో సాగుతుందన్నారు. కార్యదర్శి డి. శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో 4.73 కోట్ల నికర లాభం ఆర్జించిందని, అందుకు గాను 32 శాతం డివిడెండ్ చెల్లించాలని ప్రతిపాదించారు. దీనికి సభ ఆమోదం తెలిపింది. కోశాధికారి 2022-23 లెక్కలు, సవరించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. అంతకు ముందు డైరెక్టర్ లాలూ బూక్యా మరణించిన సభ్యులకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎం.వి. రమణ, కె.శ్రీనివాస్, వి.జి.మహీధర్, సీనియర్ మేనేజర్ కె.దామోదరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శాంతి పోస్టర్ పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక: లయన్స్ క్లబ్ గాజువాక శాఖ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ శాంతి పోస్టర్ డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల అనంతరం ప్రతిభ ప్రదర్శించిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులను, పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎంఎస్ఎన్ మూర్తి, జగదీష్ ప్రసాద్, చిక్కా సత్యనారాయణ, సత్యాల కోటేశ్వరరావు, జైరాం తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరిచే కుట్రలను తిప్పికొట్టండి



సభలో మాట్లాడుతున్న నర్సింగరావు

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరిచే కుట్రలను తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు రక్షణ బైక్ యాత్ర గురువారం ఉదయం కొవ్వొత్తుల జంక్షన్‌కు చేరుకుంది. అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌ను పరిరక్షించుకోవడం ద్వారానే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోగలమన్నారు. దీనికి భిన్నంగా రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. దీనికి తోడు ఎన్‌ఎండీసీ నుంచి తక్కువ ధర చెల్లించి ఇనుప ఖనిజాన్ని కొనుగోలు చేసేందుకు అనుమతించకుండా తీవ్ర విఘాతం సృష్టిస్తున్నారన్నారు. సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు, సీఐటీయూ నాయకులు వై.టి. దాస్, కె.ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ముగిసిన పవిత్రోత్సవాలు

సింహాచలం : సింహగిరిపై ఐదు రోజులుగా జరిగిన పవిత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపును పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఉదయం ఏకాంత స్నపనాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. గంగధార జలాలు, పంచామృతాభిషేకాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు.

గణనాథుడి సన్నిధిలో అన్న సమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 87వ వార్డులో ఏర్పాటు చేసిన పలు గణపతి మండపాల వద్ద గురువారం అన్నసమారాధన నిర్వహించారు. కణితి కళింగవీధి, అప్పికొండ శెట్టిబలిజ వీధిలో నెలకొల్పిన గణపతి విగ్రహాలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సందర్శించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు నాయకులు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, కోమటి రమాదేవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

67వ వార్డులో..

గాజువాక: వరసిద్ధి వినాయక పూజా మహోత్సవం సందర్భంగా 67వ వార్డు పెంటయ్యనగర్‌లో గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, యువజన సేవా సంఘం అధ్యక్షుడు ప్రకాష్, స్థానిక నాయకులు అప్పారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యారాడ తీరంలో గుర్తు తెలియని మృతదేహం

పెదగంట్యాడ: యారాడ తీరానికి గుర్తు తెలియని మృతదేహం కొట్టుకువచ్చింది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో యారాడ అగ్రిగోల్డ్ బీచ్ దగ్గరలో మృతదేహాన్ని గుర్తించామన్నారు. అయితే గుర్తు పట్టలేనంతగా, నడుము నుంచి కాళ్ల వరకు మాత్రమే ఉందని తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రూ. కోటితో ప్రధాన కాలువ నిర్మాణం

శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగిరెడ్డి



ప్రధాన కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గంలో అన్ని వార్డులను అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు కేఎల్ రావు నగర్‌లో రూ. 1 కోటి వ్యయంతో ప్రధాన కాలువ నిర్మాణ పనులకు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడుతో కలసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు పడేటప్పుడు ప్రధాన కాలువలు, గెడ్డల ద్వారా నీరు సజావుగా పారేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు, నియోజకవర్గ పరిధిలోని ప్రతీ వార్డులో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో లభివృద్ధి, సంక్షేమం కుంటుపడ్డాయని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు అప్పారావు, శివ, గోపాల్, నాయకులు పెద్దింటి మంగునాయుడు, జుత్తు లక్ష్మి, పులి పెంటయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు, అధ్యాపకులు

అగనంపూడి: దువ్వాడ సమీపంలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు యూజీసీ స్వయం ప్రతిపత్తి మంజూరు చేసింది. విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ అరుంధతి మాట్లాడుతూ పదేళ్ల పాటు గుర్తింపు ఉండేలా యూజీసీ ఉత్తర్వులు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాది నాక్ ఏప్లస్ గుర్తింపు రావడం, మరోపక్క స్వయంప్రతిపత్తి కళాశాలగా ప్రకటించడంలో కళాశాల యాజమాన్యం చొరవ, అధ్యాపకులు, విద్యార్థుల సమష్టి కృషి అభినందనీయమన్నారు. తరువాత కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 22 మంది ఎంపిక



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాక్ట్‌సెట్ కంపెనీ, క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి 22 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తెలిపారు. ఎంబీఏ విద్యార్థులకు ఫ్యాక్ట్‌సెట్ కంపెనీ యాజమాన్య ప్రతినిధులు మనీలా, అనుపమ రంజన్, కిషోర్ కుమార్, వెంకట సత్య కృష్ణ రెండు రోజుల పాటు వివిధ దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలియజేశారు. కళాశాల నుంచి 112 మంది విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనగా 22 మందిని ఎంపిక చేశారని చెప్పారు. రూ.3.4 లక్షల వార్షిక వేతనంతో వీరిని ఎంపిక చేశారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డీన్ బోడే ప్రసాద్, ఎంబీఏ హెచ్‌వోడీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

వైభవంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం గిరి ప్రదక్షిణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభించిన ప్రదక్షిణలో భక్తుల గోవింద నామస్మరణతో గిరి మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువ జామున వెంకటేశ్వరస్వామికు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా తన రచనలతో జాతిని జాగృతం చేశారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గుర్రం జాషువా జయంతిని బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుర్రం జాషువా రచనల్లో సామాజిక స్పృహ ఉండేదన్నారు. తన కవితలతో సమాజాన్ని మేలుకొలిపారని గుర్తు చేశారు. గబ్బిలం, పరదేశి, గిజిగాడు, క్రీస్తు చరిత్ర, సత్యహరిశ్చంద్ర తదితర కావ్యాలు రచించి మహా పండితునిగా పేరు గాంచారన్నారు. అటువంటి కవిని గుర్తు చేసుకుని సమాజానికి మనవంతు సేవ చేయాలని పిలుపునిచ్చారు. మార్టుపూడి పరదేశి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, పల్లా చినతల్లి, నక్క వెంకటరమణ, గంట్యాడ గురుమూర్తి, సంపంగి ఈశ్వరరావు, ములకలపల్లి వెంకటేష్, పిట్టా రెడ్డి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

గాజువాక పీహెచ్‌సీ పరిశీలన



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ వర్మ

గాజువాక: జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ గాజువాక పీహెచ్‌సీని గురువారం పరిశీలించారు. త్వరలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కోసం పీహెచ్‌సీలో చేస్తున్న ఏర్పాట్లను గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అధికారులకు వివిధ సూచనలు చేశారు. తాము చేస్తున్న ఏర్పాట్లను పీహెచ్‌సీ సీహెచ్‌వో నాగ అప్పారావు ఈ సందర్భంగా వివరించారు.